క్లుప్తంగా

ఉచిత ప్రవేశ పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 5, 6, 7 తరగతుల విద్యార్థులకు పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షను 24న ఉదయం 9.30 గంటలకు సిద్దిపేటలో నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్‌వలీఅహ్మద్, యాదగిరి గురువారం తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో 5 నుంచి డిగ్రీ వరకు పేద విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 94416 79704, 99484 39063 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

డ్రైవర్లు అప్రమత్తం

ఏసీపీ సుమన్‌కుమార్



సిద్దిపేటకమాన్: దూర ప్రాంతాలకు వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రెండున్నర గంటలకు వాహనాన్ని ఆపి టీ, కాఫీ లాంటివి తాగడం లేదా ఐదారు నిమిషాల పాటు నడవడం వంటివి చేయాలన్నారు. రాత్రి సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకుంటూ సురక్షితంగా డ్రైవింగ్ చేయాలని కోరారు.

108లో మగబిడ్డకు జననం



ప్రథమ చికిత్స చేస్తున్న ఈఎంటీ జ్యోతి

గజ్వేల్‌రూరల్: పురుటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి 108 వాహనంలోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ములుగు మండలం అచ్చాయపల్లికి చెందిన శారద పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వాహన సిబ్బంది శారదను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డకు పల్స్ లేకపోవడంతో సీపీఆర్ చేసిన ఈఎంటీ జ్యోతికి, అలాగే పైలెట్ మహేందర్‌కు శారద కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పశువులకు టీకాలు



టీకా వేస్తున్న అధికారి శ్వేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలో పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి శ్వేత తెలిపారు. జగదేవ్‌పూర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మాట్లాడుతూ ప్రతియేటా పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లోను వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండాపూర్‌లో పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు అధికారులు ఎట్టకేలకు కనెక్షన్ ఇచ్చారు. బుధవారం సాక్షిలో ప్రచురితమైన 'ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు.. కనెక్షన్ మరిచారు' అనే కథనానికి అధికారులు స్పందించారు. మండల విద్యుత్‌శాఖ ఏఈ శివశంకర్ స్పందించి గురువారం ఉదయం కొండాపూర్ గ్రామానికి సిబ్బందితో వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. యేడాదిగా ఉన్న సమస్య తీరడం వల్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

పోరాటం ఆగదు



మాట్లాడుతున్న జేఏసీ సభ్యులు

సిద్దిపేటకమాన్: వక్ఫ్ చట్టం రద్దయ్యేంత వరకు పోరాటం ఆగదని ముస్లిం జేఏసీ సభ్యులు అబ్దుల్ సమి, కరీమొద్దీన్ హెచ్చరించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచన మేరకు ముస్లిం జేఏసీ ఏర్పాటు చేశామని, మూడు నెలల పాటు ప్రతి శుక్రవారం మసీదుల వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జుబేర్ హుస్సేన్, ఖుద్దుస్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలోనే వేచి.. నీరసించి..

పైనుంచి ప్రచండమైన ఎండ.. కాళ్ల కింద నిప్పులు కక్కుతున్న రోడ్డు.. వీస్తున్న వడగాలుల మధ్య బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. ఇదీ.. బస్‌షెల్టర్ లేని జాతీయ రహదారిపై కనిపిస్తున్న నిత్యకృత్యం. మండుతున్న ఎండలో నిలువ నీడలేక రోడ్లపై నిలబడి ప్రయాణికులు అల్లాడి పోతున్నారు.



మండుటెండలో పడిగాపులు పడుతున్న ప్రయాణికులు

బస్సుషెల్టర్ లేక బాధలు

- వడగాలుపుల్లో పడిగాపులు
- అల్లాడుతున్న ప్రయాణికులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారం చౌరస్తాలో జాతీయ రహదారిపై కనీసం బస్‌షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులు గంటల తరబడి ఎండలోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. బస్‌స్టాప్ పరిసరాల్లో కనీసం చెట్లనీడ కూడా కరువడడంతో వారి కష్టాలు చెప్పలేని విధంగా ఉన్నాయి.

నీరసించి పోతున్నాం..

మిరుదొడ్డి, దుబ్బాక మండలాలకు చెందిన ప్రయాణికులు ధర్మారంచౌరస్తాలో దిగి వారి వారి గమ్యస్థానాలకు వెళ్లాల్సి ఉంటుంది. దుబ్బాక, సిద్దిపేట, రామాయంపేట, మెదక్, సంగారెడ్డి, గజ్వేల్, సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే ఈ బస్‌స్టాపే ముఖ్యం. ఆర్డినరీ బస్సులతో పాటు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు ఈ చౌరస్తాలో ఆగుతాయి. దీంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు ధర్మారం చౌరస్తా వద్ద వేచి ఉండక తప్పదు. కానీ, బస్‌షెల్టర్ లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు మండుటెండలో మగ్గిపోతున్నారు. నిలవడానికి నీడలేక నీరసించి పోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ధర్మారం చౌరస్తాలో బస్‌షెల్టర్ నిర్మించి ఇబ్బందులు తొలగించాలని వేడుకొంటున్నారు.

ఎండలో మస్తు తిప్పలైతుంది



ధర్మారం చౌరస్తాలో బస్‌షెల్టర్ లేక మస్తు తిప్పలైతుంది. దంచి కొడుతున్న ఎండలకు పాణమంత గావురగావురైతుంది. దగ్గరలో చెట్లనీడ కూడా లేదు. బస్సులు వచ్చే వరకు ఎండలోనే ఉండాల్సి వస్తుంది. చౌరస్తాలో బస్‌షెల్టర్ నిర్మిస్తే ఇబ్బందులు తప్పుతాయి.

- గూళ్ల లక్ష్మి, ధర్మారం

అధికారులు చొరవ తీసుకోవాలి



ధర్మారం చౌరస్తాలో బస్‌షెల్టర్ ఎండకు ఉక్కిరి బిక్కిరవుతున్నాం. చౌరస్తా నుంచి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని బస్‌షెల్టర్ నిర్మాణానికి అధికారులు వేగిరం చొరవ తీసుకోవాలి.

- తుమ్మల బాల్‌రాజు, మాజీ సర్పంచ్, కాసులాబాద్



జగదేవ్‌పూర్(గజ్వేల్): పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ మోసాలను వివరించాలి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ 25 యేళ్ల రజతోత్సవ సభకు ఊరూ.. వాడా కదిలి రావాలని.. కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కేశినేని ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఆవిర్భవించి 25 యేళ్లు పూర్తికావడంతో వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఇంద్రసేనారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కవిత, నరేశ్, చంద్రశేఖర్, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, నాగరాజు, రంగారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్: కాంగ్రెస్ పాలనపై ప్రజా ఆగ్రహం వెల్లువెత్తుతోందని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక శోభాగార్డన్స్‌లో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలన స్వర్ణయుగాన్ని తలపించిందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మధు, ఎల్లయ్య, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ దూల్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. కొండాపూర్ గ్రామంలో రజతోత్సవ సభ పోస్టర్లలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభను విజయవంతం చేయాలన్నారు.

మూడు నెలల నుంచి కూలి లేదు

కొమురవెల్లి(సిద్దిపేట): మూడు నెలల నుంచి ఉపాధి కార్మికులకు కూలి డబ్బులు చెల్లించకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాడూరి రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పోసాన్‌పల్లిలో గురువారం ఉపాధి పనులు జరుగుతున్న చోటకు వెళ్లి కార్మికులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే పనిప్రదేశాల్లో షేడ్ నెట్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేవని వాపోయారు. కూలి రేటు రూ.200 నుంచి రూ 600 లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అశోక్, వంశీ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు లేక రైతుల ఇబ్బందులు

మద్దూరు(హుస్నాబాద్): వెంటనే ఐకేపీ సెంటర్లు ప్రారంభించి వడ్లను కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. దూల్మిట్టలో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోతలు పూర్తిచేసుకొని ధాన్యం సిద్ధంగా ఉన్నా కొనుగోళ్లు ప్రారంభించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని గ్రామాల్లోను కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రాజు, ప్రసాద్, కాశీరాములు, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ప్రారంభించాలి

చేర్యాల(సిద్దిపేట): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌మావో డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రైతులు మార్కెట్‌కు ధాన్యం తెచ్చి 15రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడం దారుణమన్నారు. తాలు తూర్పార పట్టే మిషన్లను సరిచేసి రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. మల్లేశం, ప్రభాకర్, మల్లయ్య, కనకయ్య, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్): మాట్లాడుతున్న రవికుమార్

ఉపాధ్యాయులు కృషిచేస్తే సరిపోదు

టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు

దుబ్బాకరూరల్: విద్యా సంస్థలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఉపాధ్యాయులు మాత్రమే కృషిచేస్తే సరిపోదని, ప్రభుత్వం కూడా తన వంతు పాత్ర పోషించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని చీకోడ్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం టీపీటీఎఫ్ మండల సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఉపాధ్యాయులకు ప్రవేశ టార్గెట్‌ను విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తరగతి గదికి ఒక్కో ఉపాధ్యాయుడిని నియమించాలని, విద్యాశాఖకు తగిన బడ్జెట్ కేటాయించాలని కోరారు. నాయకులు మోహియొద్దిన్, నరసింహారెడ్డి, శివాజీ, రాజు, గోపాల్‌రెడ్డి, సాదత్ అలీ, చంద్రశేఖర్, ఆనంద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

గజ్వేల్‌రూరల్: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ అన్నారు. ఆస్పత్రిలోని బాలింతల వార్డులో గురువారం తల్లిపాల ప్రాముఖ్యతపై ఆర్వీం మెడికల్ కళాశాలకు చెందిన బీఎస్సీ విద్యార్థులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు అందించే ముర్రుపాలు అమృతంతో సమానమని, తల్లిపాలను పట్టించడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అన్నపూర్ణ

రైతుల సౌలభ్యం కోసమే..

నంగునూరు(సిద్దిపేట): రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పాలమాకుల పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మగ్దుంపూర్, అప్పలాయిచెర్వు, నర్మేట, వెంకటాపూర్, తిమ్మాయిపల్లి, కోనాయిపల్లి, వెల్కటూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీశైలం, ఎల్లవ్వ, తిరుపతిరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

'గౌరవెల్లి' హామీ ఏమైంది?

అక్కన్నపేట(హుస్నాబాద్): గెలిచిన తర్వాత నెల రోజులల్లోనే గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తి చేయిస్తామన్న మంత్రి పొన్నం హామీ ఏమైందని బీజేపీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ కవితకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తిచేయకపోతే ఆందోళన బాటపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రావు, నరేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో మాతాశిశువులకు ఆరోగ్యం

వర్గల్ వైద్యాధికారి డాక్టర్ హరిత

వర్గల్(గజ్వేల్): పౌష్టికాహారంతోనే మాతాశిశువులు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ హరిత అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని గౌరారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ మేళా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ మచ్చేందర్ మాట్లాడుతూ పోషకాహారం మాతాశిశువులకు చేరేలా అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, సీసీ పద్మలత, అంగన్‌వాడీ టీచర్లు రామలీల, సంతోష తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తొగుట(దుబ్బాక): తొగుట, ఎల్లారెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ నర్సయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమ్ముల్ మిల్లెట్స్‌పై అవగాహన కల్పించి, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సతీశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లద్నూరులో..

మద్దూరు(హుస్నాబాద్): గర్భిణులు, బాలింతలు, తప్పనిసరిగా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ రమాదేవి సూచించారు. మండలంలోని లద్నూరు గ్రామంలోని రైతువేదికలో పోషణ్ పక్షోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్ రహీం, ఎంపీడీఓ రామ్మోహన్ అంగన్వాడీ టీచర్లు ఎలిజబెత్‌రాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.



వర్గల్(గజ్వేల్): మాట్లాడుతున్న హరిత

కొడకండ్ల గ్రామంలో..

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రం 3లో నిర్వహించిన కార్యక్రమంలో కుకునూర్‌పల్లి పీహెచ్‌సీ అధికారి అఖిల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్యలక్ష్మి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, వైద్య సిబ్బంది భూలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, కవిత, ఉపాధ్యాయులు రహేలా, కల్పన తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

నంగునూరు(సిద్దిపేట): ముండ్రాయి సెక్టార్‌లోని బద్దిపడగలో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లు దాటిన చిన్నారులకు అసెస్మెంట్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూప, సీఆర్పీ రజిత, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, శ్రీలత, లలిత, రాజేశ్వరి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహార స్టాళ్ల ప్రదర్శన



కోహెడరూరల్(హుస్నాబాద్): పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

కోహెడరూరల్(హుస్నాబాద్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ జయమ్మ సూచించారు. మండలంలోని నాగసముద్రాల గ్రామంలో కోహెడ సెక్టార్ అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాళ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు ఐరన్, కాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని జిల్లెలగడ్డలోని ఓ వ్యవసాయ బావిలో గ్రామస్తులు గురువారం ఓ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే సమావేశం

దుబ్బాకటౌన్: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం దుబ్బాకలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వంశీ కృష్ణగౌడ్ గురువారం తెలిపారు. కోమటిరెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కరాటే ఆత్మ రక్షణకు దోహదం

కొండపాక(గజ్వేల్): కరాటే ఆత్మ రక్షణకు దోహదపడుతుందని బీఆర్‌ఎస్ నాయకురాలు మానస అన్నారు. మండల పరిధిలోని దుద్దెడ హైస్కూల్ ఆవరణలో గురువారం కరాటే గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. కరాటే మాస్టర్ ఫిఫ్త్ డాన్ తిరుపతి నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెస్టులో ఆమె పలువురికి సర్టిఫికేట్లు, బెల్ట్‌లను అందజేశారు. మానస మాట్లాడుతూ రాటేతో శారీరక సామర్థ్యం, మానసిక వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కరాటే శిక్షకులు పాల్గొన్నారు.



విజేతలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న మానస

రాష్ట్రపతి పాలన విధించాలి

సిద్దిపేటజోన్: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని జిల్లా హిందూ వాహిని అధ్యక్షుడు సత్యం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం హిందూ వాహిని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగాల్‌లో హిందువులు, దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, కిరణ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హిందూవాహిని ఆధ్వర్యంలో ర్యాలీ

సంక్షిప్త వార్తలు

◆ నేడు 'విద్యుత్'కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ శ్రీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనగర్‌కాలనీ, పాతబస్టాండ్, శివాజీనగర్, ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

◆ మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 11మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.24 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ దరఖాస్తులకు ఆహ్వానం

వర్గల్(గజ్వేల్): వర్గల్ పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. విద్యార్థులు మే 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాల కోసం 7995076688 నంబరును సంప్రదించాలని సూచించారు.

◆ ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం

కోహెడరూరల్(హుస్నాబాద్): ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని జిల్లా సెక్టోరియల్ అధికారి రంగనాథ్ అన్నారు. మండలంలోని శనిగరం ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుడు మెంగన బాల్‌రెడ్డి పదవి విరమణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డిని సన్మానించి అనంతరం ఆయన మాట్లాడారు. ఎంఈఓ పద్మయ్య, హెచ్‌ఎం సరళ, సెక్టోరియల్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మర్కూక్ ఎంపీఓగా సత్యనారాయణ

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ నూతన ఎంపీఓగా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీఓగా పనిచేసిన రాజలింగం పదవి విరమణ పొందారు. ఆయన స్థానంలో నంగునూర్ మండలం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన సత్యనారాయణ ఎంపీఓగా బాధ్యతలు చేపట్టారు.

◆ సీఎం సహాయనిధి పేదలకు వరం

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం సహాయనిధి పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గౌరాయపల్లిలోని లబ్ధిదారులైన నర్ర రాములమ్మకు మంజూరైన రూ.60 వేలు, అలాగే ఇంద్రపురి కిరణ్‌కు రూ.45 వేలు, కల్పనకు రూ.35 వేల విలువైన చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలసి గురువారం ఆయన అందించారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాస్, రేష్మ, కనుకరాజు, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రమేశ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దిపేటకమాన్: షెడ్యూల్డ్ కులాల వర్గీకరణతో మాదిగల హృదయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిరకాలం నిలిచిపోతారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సీఎం రేవంత్, మందకృష్ణ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. నరహరి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ సవరణ బిల్లును ఉపసంహరించుకోండి

గజ్వేల్: కొత్త పెన్షన్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ డిమాండ్ చేశారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయుడు రాంరెడ్డి ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జె.శ్రీనివాస్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

◆ అర్చక ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి అతిథి గృహంలో గురువారం రాష్ట్ర అర్చక ఉద్యోగుల డైరీని గురువారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అర్చక జేఏసీ చైర్మన్ ఉపేందర్‌శర్మ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆలయాల అభివృద్ధితోపాటు అర్చకుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. మే 15 నుంచి జరిగే సరస్వతి పుష్కరాలకు నిధులు కేటాయించారన్నారు. ఏఈఓ శ్రీనివాస్, మహదేవుని మల్లికార్జున్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.